# కనిపించని కలం ★

రచన:
"రాధిక"

సుశీల, పిల్లలు, సుశీలవాళ్ల కన్నవారింటికి వెళ్లారు చూసి రావడానికని. సాయంకాలం వరండాలో వేసిన కుర్చీలో కూచున్నాను చాలా ప్రశాంతంగా ఉంది. ముందు ప్రాంగణంలో వికసించిన గులాబీలమీదుగా వచ్చే గుబాళింపు యేవేవో మధురస్మృతులను జ్ఞప్తికి తెస్తున్నది. అటుచూస్తే స్వచ్ఛమైన నీలాకాశము...గంభీరముద్రతోనున్న సముద్రము... ఎత్తయిన పచ్చికతో కూడిన పచ్చని పర్వతాలు...ఇవన్ని నన్నెక్కడకో ఊహాలో కానికి తీసుకుపోతున్నాయి.

కాఫీ తీసుకొచ్చి 'టేబిల్' మీదుంచాడు వంటమనిషి అప్పన్న.

"గోపీ ఏదిరా?" ప్రశ్నించాను

"సరుకులుతేడానికి బజారెల్లాడండి"

"సరే! అ డ్రాయరుమీద పెన్ను-కాగితాలు ఉంటాయి తీసుకురా" అని చెప్పి-ఆలోచించసాగాను కథ యేదైన రాయాలనే ఉద్దేశ్యంతో.

కాగితాలు తీసుకొచ్చి నా కిచ్చాడు.

"కలం కన్పించనేదండి"

"అక్కడే ఉండాలి చూడవోయ్"

"అదేటి బాబు! అక్కడనేదండి-మీ రెక్కడెట్టారో ఏటో?"

"అక్కడే ఉంటుంది చూడు ... ఏం రెక్కలొచ్చి ఎగిరిపోతుందా?" చెప్పాను కొంచెం గట్టిగా.

"అది నాకేటి తెలుస్తాది బాబూ... గోపీని రానిండి అడుగుతాను" తప్పించుకోడానికి ఏదో సమాధానం చెప్పాడు అప్పన్న.

"నువెప్పుడూ చూడనే లేదురా?"

"నేదండి, పరాయాళ్ళాటిని కన్నెత్తి చూడను. తమకొండే అన్నం కుండలో యేటుందో చూడను"

"అవును, అందుకే నువ్వుచేసే వంట అంత గొప్పగా నలభీమపాకంలా ఉంటుంది. ఏధవకవుర్లునువ్వూ... పెన్నెక్కడుందో చూడు"

రేడియో 'అన్' చేశాను. సిలోను నుంచివచ్చే సినిమాపాటలు వింటూ, అలా యేదో ఆలోచించుకుంటు కూచున్నాను.

ఎంతసేపటికి ఎవ్వరూ పెన్ తేకపోవడంతో గదిలోనికి వెళ్లాను.

గోపీ గదంతా కలయ తిరుగుతున్నాడు. ఏవిటో వెదుకుతున్నారు. ఏమిటో? ఇంకేమిటి పెన్నే.

"కన్పించలేదండి... చూస్తున్నాను" అంటూ అక్కడున్న పేపర్లు అవి క్రింద మీద వేస్తున్నాడు గోపీ

గడ్డిమేటిలోని పిన్నునైన కొద్దిక్షణాల్లో వెతికి పట్టుకుంటారు. మీరుమాత్రం వట్టి దద్దమ్మలు" అన్నాను కోపంగా మాటవరసకి.

"ఏటి యేటి సార్! నీటిలోవున్నా తెస్తాను"

"మాటలు కోటలు దాటుతున్నాయి. చూసి తీసుకురా" అని ముందుకు కదిలాను.

"దౌర్భాగ్యులు—ఏవి ఎక్కడుండాలో యేమీ చూడడంలేదు. కబుర్లపోగులు" అనుకుంటుండగా.

"ఇదిగోండి సార్! దొరికింది" అంటూ ఒక్కదూకుని నే నున్నదగ్గిర కొచ్చాడు గోపి.

పిన్ను నాచేతిలో ఉంచబోయాడు.

తెల్లబోతూ..."ఇదేమిటిరా? ఇదెందుకు? పెన్ను కావాలంటే పిన్నుదేనికి"

"మీరేకదండి" గొణిగాడు గోపి

"అప్పన్న పెన్ను అని చెప్పాడండి, కాని మీరు పిన్ను మేటిలోనుంచి..."

"నోర్ముయ్"

"మీరు పిన్ను అంటే వాడు పెన్ను అనుకున్నాడని అనుకున్నాను సార్" అన్నాడు గోపి అపాలజీ చెప్పుకొనే వాడిలా.

"గోపి సెప్పాడు బాబు తమరు పిన్ను అడిగితే నేను పెన్ను అని సెప్పానని, ఈడు నన్ను సెవిటోడన్నాడండి. మా ఆడది నన్ను సెవిటిమాలోకం అంటది బాబయ్యా; ఇదంతా యేటో అనుకుంటూ నేనుకూడా దానికోసం వెతికాను"

"వట్టి చవటలు. పిన్నుకోసం అరగంట వేస్తు" అని వారిపై విసుక్కుంటుంటే.

"అదేమిటిసార్-సోయినప్పుడు ఏదైన ఒకటేనండి. ఇవ్వాళ చిన్నదౌతుంది. రేపు పెద్దదౌతుంది. అన్నింటిలోను జాగ్రతగ వుండాలని మీరేగదండి చెప్పారు" నేను గతంలో చెప్పింది తిరిగి అప్పగించాడు గోపి.

"పెన్నయితే ఇదిగోండి. పిన్నేమో కావాలని దీనిని తేలేదు" అంటూ గోపి కలాన్ని టేబిల్ పై నుంచాడు.

వీ రిద్దరినిచూస్తే ముందుకోపమైతే చాలా వచ్చింది, కాని తరువాత పరమానందయ్య శిష్యులు గుర్తుకొచ్చారు. వారు సవినయంగా చేతులు కట్టుకు నిలబడ్డారు; ఏది కోరిన చేయడానికి సిద్ధంగా. పాపం అమాయకులు అనుకుంటూ,

"మీ ప్రాణాలు తోడేద్దును. మీ అమ్మా, నాన్నా యేడుపు చూడవలసి వస్తుందని క్షమించాను." కోపాన్నభినయిస్తూ అన్నాను.

"అమ్మ, అయ్యకోసం నేనేడిచేశానండి. అల్లు నాకోసం యేడవరండి" అన్నాడు అప్పన్న దైన్యంగా.

నాకైతే చచ్చేటంత నవ్వొచ్చింది.

"కాకపోతే మీ అవిడ దుఃఖిస్తుంది"

"బాబయ్యా! ఒకతూరి మా ఆడదండండి...'మావా' నన్నొగ్గేసి నువుపోతే కంటోనీరు ఇంకిపోయేదాక యేడుత్తానని'—దాన్ని పరీచ్చించాలనుందండి. మీరు చావగొడితే అకోరిక తీరద్దిబాబు" అన్నాడు అమాయకంగా నిట్టూరుస్తూ అప్పన్న.

గోపీ మా ఇరువురి ముఖాలకేసి అమాయకంగా చూస్తూ నిలుచున్నాడు

వారి అమాయకతను, నిష్కల్మష హృదయాలనుచూస్తే చాల ముచ్చటేసింది. అప్పుడప్పుడు సుశీల అంటూండేది మన పనిమనుష్యులు చాల చిత్రమైనవాళ్ళని, అమాయకులని మనసులోది మాట్లాడేస్తారని. నిజమే మరి.

సూర్యబింబం వాలిపోతోంది అస్తమించే రవి సహస్ర అరుణకిరణాలు ప్రపంచానికి పసిడి ముసుగును తొడిగాయి. మరింత అందంగా అగుపిస్తున్నాయి పరిసరాలు, ప్రకృతి.

కథ రాయాలని కలం తెరిచాను. ఏదో దేనికి ఇప్పటి సంఘటనే గుర్తుకొచ్చింది.

★